# సుబ్బనళినీయము

## (అను మగ వంట కథ)

నళిని గురించి చెప్పే ముందు, కాస్త వంట గురించి చెప్తాను. నళినికి వంట రాదని కాదు గానీ, నలుడు ఫలానా సుబ్బారావు అని చెప్పడానికి ముందు

– వంట గురించి చెప్పాలి.

వంట అన్నా, కథ అన్నా– ఉప్పుతో పదీ, పప్పుతో తొమ్మిదీ చూసుకోవాలి ఉప్పుతో పదీ, పప్పుతో తొమ్మిదీ ఎందుకూ? అని కథానాయకుడు సుబ్బారావుని అడిగితే, అతను చెప్పలేడు కనుక– లేదా చెప్పకపోవచ్చును కనుక– నాయిక నళినిని అడగవచ్చును అయితే, ఆ నళిన దళాక్షి వారపత్రికలలో వారగా వేసే వంటలూ– వార్పులూ గట్రా చదవదు గనుక ముక్కు గుద్దినట్లు (ఈ ముక్కు సుబ్బారావుదా? ప్రస్తుతం కాదు) "నాకు తెలియదు అని చెప్పగలదు'

వంట అనేది 'కళ' అనీ 'శాస్త్ర' మనీ రెండు వాదాలున్నాయి జీవితం అనేది మిధ్య అనీ సత్యమనీ రెండు వాదాలు వుండి, ఆ రెంటినీ ఏ విధంగా ఐతే 'యిదమిత్థ'మనీ తేల్చలేరో– అలాగే యీ వంట అనేది కూడా శాస్త్రమా లేక కళా? అన్నది కూడా నిర్ణయించలేరు– అని సుబ్బారావు వుద్దేశం

సుబ్బారావు మొదట్నించీ చురుకైన వాడు చురుకుగా, సుళువుగా వాళ్ళమ్మ వెనుక అదీ యిదీ సాయం చేస్తూ చిన్నప్పుడే వంట నేర్చుకున్నాడు మరీ– ఏడో ఏట మూడో క్లాసూ, పదో ఏట ఏడో క్లాసూ చదువుకున్నాడు ప్రస్తుతం పెద్దవాడై– పట్టభద్రుడై ఆ డిగ్రీ కాయితాన్ని భద్రంగా పటం గట్టి గోడకి వ్రేలాడగట్టాడు'

అలాగే– మొన్న నా మధ్య వాళ్ళమ్మా, నాన్న గారూ కూడ బలుక్కొని– తిరుపతిలో అని చెప్పి, తిరుచానూరులో సలక్షణంగా ఉపనయనం చేసి, మూడు పోగుల జందెం వేసి, దీవిస్తే– 'అత్తెరీ– యిరవై నాలుగు సంవత్సరాల, ఎనిమిది మాసాల తొమ్మిది రోజుల పెళ్ళీడు వాడికి మూడు పోగులేనా వేస్తారూ. అంటూ బాద పడ్డట్లు– ఆ జెందెం ముక్కను డిగ్రీ పట్టా తగిలించడానికని గోడకి కొట్టిన మేకుకే తగిలించేశాడు కూడా' అంటే– పెళ్ళికీ, ఉద్యోగానికీ కూడా సుబ్బారావ్‌కి అర్హత వచ్చేసిందన్న మాట'

సుబ్బారావు డిగ్రీకి ఓ కాపీ తీసి, పోస్టులో పంపగానే ఆడపిల్ల లెక్కువగా వున్న తండ్రి– అల్లుణ్ణి కొల్చుకునీ, చూసుకొనీ చెయ్యకుండానే పిల్లనిస్తానని వచ్చినట్లు– ఓ కంపెనీ వాళ్ళు అర్జెంటుగా, తిరుగు టపాలో ఉద్యోగమిచ్చేశారు

సుబ్బారావుకి ఎగిరి గెంతేసినంత సంతోషం వేసి, ఎగిరి గెంతేశాడు కూడా' కాని ఏం చేస్తాం– అంతెగిరినా ఆఖరికి నట్టింటి గుమ్మం కూడా నెత్తికి తగల్లేదే, ఇలాంటి పసివాణ్ణి పట్నం వుద్యోగానికి ఎలా పంపనూ?' అని వాపోయింది వాళ్ళమ్మ కానీ వాళ్ళ నాన్నగారు మాత్రం యీ విషయంలో కాస్త కోప్పడ్డారు 'ఆ యీడుకి నేనూ, నువ్వూ వాణ్ణెత్తుకుని ఆడించాం పైగా ఎన్నాళ్ళేం? ఒంటి రెక్క బతుకు– వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అని నాకు నాలుగు రాళ్ళూ– వాడికి కాస్త లోకానుభవం రావాలి" అంటూ సుబ్బారావుని రైలెక్కించేశాడాయన

వాళ్ళమ్మ ప్రేమగా– ఒక అర బస్తా దంపుడు బియ్యం, ఒక మణుగు నెయ్యి, ఒక బుట్ట నిండా నీరుల్లిపాయలు, (వెల్లుల్లిపాయలంటే సుబ్బారావుకి పరమసహ్యం!) ఒక జాడీలోకి– పాతగూనలో నుంచి ప్రత్యేకంగా తీసిన ఊట ఆవకాయ, యింకా కొన్ని మినప సున్ని వుండలూ (అవి అంటే సుబ్బారావు చెవి కోసుకుంటాడని వాళ్ళమ్మకి మాత్రమే తెలుసు) గట్రాతో రైలెక్కించేసింది' దంపుడు బియ్యం వద్దనీ– అక్కడ పట్నంలో వండి పెట్టగల వంట వాళ్ళు– సుబ్బారావుకు ఫలానీ కంపెనీ వారిచ్చే జీతం కంటే మరో పాతిక ఎక్కువిస్తే గానీ దొరకరని– నమ్మించి, వాళ్ళ నాన్న– అర మూట బియ్యం దింపేశాడు– సుబ్బారావుని రైలెక్కించేశాడు కూడా'

పట్నంలో సుబ్బారావు 'కథా నాయకుడి'లా దిగాడు అతనితో పాటు ఆవకాయ, ఆవు నెయ్యీ దిగాయి! (సుబ్బారావు గారింట్లో గేదెలు మాత్రం గలవు కాని ఆవునెయ్యి ప్రత్యేకం సుబ్బారావు కోసం కొంటారు )

ఇక్కడ కథానాయిక – నళిని గురించి పరిచయం చేయడం అవసరం నళినికి వాళ్ళ బామ్మ అంటే కోపం బామ్మకి నళిని అంటే యిష్టం ముఖ్యంగా నళిని ఒక్క జెడ వేసుకోడం మరీ యిష్టం సవరం పెట్టుకుని యించక్కా

పొడుగ్గా బారెడు జెడ అల్లుకోవే అమ్మా అంటుందావిడ పొట్టిగా, వొత్తుగా పెరిగిన కేశ సంపద కలిగిన మనుమరాలికి రెండు జెడలు– పైగా ఆ రెండూ నిజం జుట్టుతోనే వేసుకోడం యిష్టం– కొసలు వెడల్పుగా అట్లకాడల్లా వుండాలి అదీ ఫ్యాషన్, నళినికి రేడియో పెట్టడం వచ్చును

కాని బామ్మకి– నళినిని పాట నేర్చుకోమనడం– పాట పాడమనీ వేధించడం వచ్చును నళినికి 'సంయ్యాస' పార్చు వుండిపోయింది అందుచేత, యీ సిడాది ఆ అమ్మాయి యింట్లోనే వుండిపోయింది నళినికి ఒక అన్నయ్య వుండేవాడు–



మరేం వుండేవాడు అంటే అర్థం యిప్పుడు లేడని కాదు ప్రస్తుతం యింట్లో లేడని తాత్పర్యం! వాల్తేర్‌లో పెద్ద బళ్లో చదువుకుందికి వెళ్లేడు ఆ అబ్బాయి ఒక గది ఆ యింట్లో అతనికి కేటాయింపుగా వుండేది ఆ గది ప్రస్తుతం ఖాళీగా వుంది నళినీ వాళ్ల నాన్నగారు ఆ గదిని అద్దెకిద్దామా అని గట్టిగానే అనుకుంటున్నాడీ మధ్య సుబ్బారావుకి ఉద్యోగం యిచ్చిన కంపెనీలోనే ఒక గురవయ్య గారున్నాడు అతనికి నళిని 'ఫాదర్' మనసులోని ఉద్దేశం బాగా తెల్సును ఎందుకంటే, ఆ యిద్దరూ, చతుర్ముఖ పారాయణం ఫ్రెండ్సు– పైగా గురువయ్య నోరూ, అలాగే సుబ్బారావు అదృష్టం– రెండూ మంచివి అనడం మూలాన, తన సిఫార్సు మీద – నళినీ వాళ్ల యింట్లో ఖాళీగా వున్న– మెట్ల మీద గదిలో సుబ్బారావు అద్దెకి దిగిపోగలిగాడు సుబ్బారావుతో పాటు–ఆవు నెయ్యీ, ఆవకాయీ, నీరుల్లిపాయలూ ప్రవేశించాయి (కొన్ని పాయలలో వుల్లి మొక్కలు కాడలై మొలిచాయి కూడా!)

నళిని సుబ్బారావుని చూడలేదని– సుబ్బారావు అనుకున్నాడు కాని – నళిని సుబ్బారావునీ– సుబ్బారావు సామానులో వున్న ఆవకాయని కూడా చూడగలిగింది ఆ సంగతి నళినీ వాళ్ల బామ్మ కొక్కర్తికే తెలుసు

ఆవిడ, వెంటనే కోప్పడే మనిషి కాదు కనుక నళినికేసి యిలా చూసి, రెండు జెడలు వేసుకుంటే గానీ నీకు మొగుడు రాడని బెంగేమిటే?' అని అడిగింది నళిని మొహం ముడుచుకుని, 'అలా అయితే అసలు నాకు పెళ్లే అక్కర్లేదు పో అంది అవ్వ' అన్నది వాళ్ల బామ్మ నోరు నొక్కుకొని

నళిని రెండు జెడలలో యింత 'విప్లవగాడ' వుందని తెలియని సుబ్బారావు, బుద్ధిగా ఆపీసుకి, అక్కడి నుండి కాఫీ హోటల్‌కీ, ఆ తర్వాత తిన్నగా భోజన హోటల్‌కీ కూడా వెళ్లి, రెండు రోజులు ఎలాగో, ఏదో తిని నేరుగా 'రూమ్'కి వచ్చేడు మూడో రోజున ఉదయం తొమ్మిదిన్నర గంటలకి నళిని కూని రాగాలు తీస్తూ వాళ్ల 'దొడ్లో' బాత్ రూమ్‌లో, వేణ్ణీళ్లతో స్నానం చేస్తోంది వాళ్ల బామ్మ పెరట్లో– రోట్లో పప్పు పచ్చడి రుబ్బుతోంది అదే సమయానికి, అద్దంలో చూసుకుంటూ – ఆరో సారి క్రాపింగు దువ్వుకుంటున్న సుబ్బారావుకి, 'టక్కున' ఓ సంగతి గుర్తొచ్చింది

వెంటనే హుటాహుటిని ప్రక్కనే వున్న 'సజ్జ' కేసి భయంగా చూశాడు ఉల్లికాడలు తొంగి చూశాయి! – ప్రక్కనే వున్న జాడీ మూత ఎత్తాడు ఆవకాయ 'ఎర్రగా' చూసింది! నోరూరింది పాపం! సుబ్బారావుకి! కాని సీసాలో ఆవు నెయ్యి బూజు పడుతోంది ఆవకాయని ఒక గ్లాసులోకి తీసుకుని, హోటలికి పట్టుకెళ్తే? ' సుబ్బారావుకి ఆలోచనలు మెరుపుల్లా వస్తాయి కానీ పిడుగుల్లాంటి అనుమానాలం కూడా వాటిని వెంటతగులుతాయి

నళిని చూస్తుందో ఏమో?' అని భయం వేసింది ... ఆవకాయా, ఆవునెయ్యీ ఉల్లిపాయలూ అన్నీ తీసుకుని మరీ హోటల్‌కి పోతున్నాడూ అనుకుంటుందేమో ఆ పిల్ల' అనుకున్నాడు సుబ్బారావు (వంట రాకపోతే అంతేనని కూడా అంటుందేమో?)

కానీ, ఆ సమయంలో సుబ్బారావుకి అసలు తర్కమే తలకెక్కలేదు ఏమైనా, 'నళిని– రెండు జెడలు వేసుకునే నళిని– హిందీ సినిమా పాటలు గొణిగే నళిని– చూస్తూ వుండగా ఆవకాయ కాదు కదా, ఒక్క నీరుల్లిపాయ అయినా జేబులో వేసుకుని ఆ మేడ మెట్లు దిగలేను' అని ఒప్పేసుకున్నాడు సుబ్బారావు– అద్దంలో తన కెప్పుడూ అందంగా కనబడే ప్రతిబింబం ముందు నిలబడి!

ఆ విధంగా సుబ్బారావు ఆవకాయనీ, ఆవు నెయ్యినీ, కంది పొడినీ, కొరివి కారాన్నీ అన్నింటినీ 'రూమ్'లోనే భద్రంగా వొదిలి, దీనంగా మెట్లు దిగుతూండగా, స్నానం పూర్తి చేసుకుని, పరికిణీ వోణీ వేసుకొని– అలా, పెరట్లోంచి వస్తూ, యిలా యింట్లోకి పారిపోతున్న నళిని, ఓ చూపు చూసింది! దాంతో, సుబ్బారావు దీన వదనం, చెంప దెబ్బ కొట్టినట్లు చైతన్యవంతమైంది

ఇంకా నయం, ఆవకాయ లేదు చేతిలో ననుకున్నాడు– దిగి, నేరుగా ఆఫీసుకి వెళ్లిపోయాడు (భోజనం మాట మర్చిపోయి)

అలా నాలుగు రోజులు ఉత్త చేతుల్తో వెళ్లి హోటలులో తిండీ, ఆఫీసులో పనీ చేతకాక, చీవాట్లు తినేసరికి– సుబ్బారావుకి, నాలుక మీదా గెడ్డం మీదా కూడా వెంట్రుకలు మొలిచాయి

అబ్బ! నాకీ నూనె, 'రిఫైన్డ్ ఆయిల్' అయినా పడదు నాకీ పచ్చడి, 'చెట్నీ' అనబడినా కిట్టదు, అనుకున్నాడు కాని 'ఏం చేస్తాం?' రూములో అన్నీ వుండీ ఏమీ లేని వాడయ్యాడు సుబ్బారావు ఉల్లిపాయల సజ్జలో - ఎలుకలు వచ్చి కాపరం పెడుతున్నాయి కాబట్టి, సజ్జతో సహా వాటిని అవతల పారేశాడు (విధి బలీయం కదా!) కాని, చూస్తూ చూస్తూ – కాస్త వేలితో నాకి చూసిన తర్వాత కూడా– ఆవకాయనీ, ఆవు నెయ్యినీ ఎలా పారెయ్యడం? కానీ సుబ్బారావు చురుకైన వాడనీ, పట్టభద్రుడనీ ముందే చెప్పాను కదా! ధైర్యం కోసం, వాళ్లమ్మ రాసిన ఉత్తరం తీసి చదువుకున్నాడు మరో సారి! 'బాబూ! ఆశీస్సులు ఎలా వున్నావో ఏమో? అయ్యో! దంపుడు బియ్యం కాకపోతే మానె, మర బియ్యమైనా ఓ పావు మూట నీతో పట్టుకు పోకపోతివే నని ఆమె బాధ పడుతూ రాసింది



# సుబ్బనళినీయమ్! అను మగ వంట కథ

ఆ వేళ ఆఫీసులో సుబ్బారావుకి పని తోచలేదు. 'వంట' బుర్రలో ప్రవేశించింది. నళిని కూడా గుర్తుకు రాలేదు. ఎంత సేపూ భోజనం- ముఖ్యంగా వేడివేడి అన్నం, నెయ్యీ, కంది పొడుం, ఆవకాయా లాంటి తెలుగు మాటలన్నీ బుర్రను దొలి చేస్తున్నాయి. అవి తలలోంచి. చేతి మీదుగా కలంలోకి దూరి, కాయితం మీదికి 'నల్ల'గా జారి పోతాయేమోనని భయమేసింది. ఎట్టకేలకు సుబ్బారావు ఒక నిర్ణయం చేసుకున్నాడు. "నేను వండుకుంటాను" అనుకున్నాడు. వండుకోడానికి ఏం కావాలీ? మొదటిది వంట రావాలి. అది సుబ్బారావుకి రాదని ఏ చరిత్రకారులైనా రాస్తే, వాళ్లని గుండేసి కొట్టినా పాపం లేదు. సుబ్బారావు భీముడు కాకపోయినా, నలుడు కాగలడు.

తిన్నగా మానేజర్ దగ్గరకు వెళ్లి, "సార్ ఐ వాంట్ లీవ్" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు మానేజర్- "వంట వండుకోవాలి" అని అనేసి, సుబ్బారావు నాలిక్కరుచుకున్నాడు. ఆ మానేజర్ తెల్లబోయి, "వ్వాట్" అన్నాడు. సుబ్బారావు సిగ్గుపడుతూ- "నేను నా రూములోనే వంట పెట్టుకుని భోజనం చేస్తాను సార్. యీ హొటలు తిండ నాకు పడటం లేదు అని మా అమ్మ లెటర్ రాసింది" అన్నాడు. సుబ్బారావు తెగువకి మానేజర్ తెలుగులో నవ్వేసి, 'లీవ్'




యింగ్లీషులో 'గ్రాంట్' చేశాడు!

"ఇక నళిని నన్ను చూసి "నవ్వపోదు" అని సుబ్బారావు ధైర్య పడ్డాడు.

★ ★ ★ ★

తక్షణం ఒక జనతా స్టౌ కొన్నాడు- రెండు సిల్వర్ గిన్నెలు, ఒక గరిట కొన్నాడు- నలుడై పోయిన సుబ్బారావు. తను తెచ్చుకున్న ఆవకాయా, ఆవునెయ్యీ తినాలంటే- తన స్వయంపాకం సుబ్బారావుకి, అతనిలోని భోజనప్రియత్వమనే కళాత్మకమైన అభిరుచికీ కూడా- అప్పట్లో అత్యవసరం కనుక- అవి వెంటనే కొన్నాడు. కానీ కిరసనాయిలు మర్చిపోయాడు. బీడీలు కాల్చే అలవాటు లేదు కనుక అగ్గిపెట్టె కొనుక్కోలేదు. ఒక యిత్తడి గ్లాసు, టిఫిన్ కారియర్‌లోని అయిదు గిన్నెలూ రూములో వున్నాయి, ఫర్వా లేదని ఆలోచించాడే తప్ప- మూకుడూ, దాంతో పాయ్యీ- దానిలోకి యింధనం లేని వంట సామాగ్రి సశేషమని తెలుసుకోలేకపోయాడు సుబ్బారావు.

అంచేత, ఆ రాత్రికి సుబ్బారావు మళ్లీ హొటల్‌కి వెళ్లాల్సి వచ్చింది. వెళుతుండగా నళిని కనిపించింది. "పోనీ వీళ్లను కాస్త కిర్సనాయిలూ, అగ్గిపెట్టే ఎరువు అడగనా?" అనుకున్నాడు సుబ్బారావు. కానీ, చూస్తూ- చూస్తూ రెండు జెడలు వేసుకున్న ఆడపిల్లను ఎలా అడగటమూ? అని సంకోచించాడు. కాని, సుబ్బారావు గట్టివాడు. ముఖ్యంగా యిలాంటి విషయాల్లో హరిబ్రహ్మాదులు అడ్డంగా వచ్చినా, అనుకున్న పని చేసి తీరుతాడు. కాబట్టి, అడ్డంగా వచ్చిన నళినిని అడిగి తీరాలి అనుకున్నాడు. అది గమనించినట్లు నళిని కూడా "ఏం కావాలండీ?" అంది కమ్మగా...

"కిర్సనాయిలు"- పెదాలు తడవుకున్నాడు. నళినికి ఆశ్చర్యంతో పాటు కాస్త భయం కూడా వేసింది. కాని, తెలివైంది గనుక, కరెంట్ పోతే, కొవ్వొత్తులున్నాయిగా, యిస్తానంది- జాలిగా.

"కాదు, కరెంట్ వుంది... వండుకుందామని... కిర్సనా...." సుబ్బారావునిక యెవ్వరూ ఆడ్డలేరు. కానీ మాట పూర్తి కాకముందే నళిని పారిపోయింది. బయమో, ప్రేమో, అనుమానమో, అదొక శృంగార చేష్టా విశేషమో లేక తెలుగు పాఠమో తెలియని సుబ్బారావు కూడా, అంత కంగారూ పడిపోయాడు: నళిని వెళ్లి వాళ్ల బామ్మను పంపింది. కానీ అంతలో కంగారు పడి, బయట పడ్డ సుబ్బారావు- హొటలు దాకా వెళ్లి గానీ తిరిగి చూడనే లేదు.

వాళ్ళ బామ్మ నళినిని పిలిచి, "ఏమే! నీవు పెంకితనం చేస్తున్నావా? లేక, ఆ కుర్రాడు వేషాలు వేస్తున్నాడా? చెప్పు, "కిర్సనాయలెందుకూ అతగాడికీ? ఏడీ ఎక్కడున్నాడూ?" అని గుడ్లురిమింది.

నళిని నవ్వి, అంతలో ఏడుపు మొహం పెట్టి, "నీ మీద ఒట్టు బామ్మా! ఆ అబ్బాయి వొండుకుందికి కిర్సనాయిలే అడిగాడే" అంది.

"వొండుకుంటాడా? అయితే ఒడ్లు కాబోలే పిల్లా!... పోన్లే రేపు యిద్దాం," అంది ఉదారంగా బామ్మ.

అయితే, పౌరుషం గల సుబ్బారావుకు- ఆ, 'రేపు' కిర్సనాయిలు, వడ్లు లాంటివి అడిగే అవసరమే లేదు. అన్నీ స్వయంగా తెచ్చుకున్నాడు. తన గదిలోనే ఒక ప్రక్కన- కాలువ కన్నం వున్న దగ్గర, 'స్టౌ'- పెట్టాడు. పప్పూ, ఉప్పూ అన్నీ చిన్న చిన్న పొపుల పెట్టె లాంటి దాంట్లోనే అమర్చాడు. నళిని గారింట్లో పని చేసే 'గంగాయమ్మ' చేతనే డాబా మీదే బియ్యం కడిగించేడు. గంగాయమ్మ- జాలిపడి, "ఎందుకు బాబూ? మీకీ శ్రమ! కావాలంటే క్రింది బామ్మగారు మడిగా వండి పెడతారు. తినరాదా? నేను చెప్పనా ఏంటి?" అని అడిగింది- కానీ సుబ్బారావు తెలుగులో - విశ్వస్త వద్దించినా, వెల్లుల్లి వేసినా తినడానికి నేను ఏమీ శ్రీనాధుణ్ణి కానుగంగాయమ్మా!" అన్నాడు.

"నాకు వంటవచ్చునుగా" అని కూడా ప్రకటించాడు.

"సరే! మీ యిష్టం" అంది గంగాయమ్మ. "పిచ్చి కాబోలు" అని స్వగతం పలుక్కుంది కూడా!

కారియర్ గిన్నెలతోనూ- సిల్వర్ మూకుడుతోనూ- మొత్తం మీద- సుబ్బారావు అన్నం, కూరా చేసుకున్నాడు. బంగాళా దుంపలు తొక్క తీయకుండా బ్లేడుతో తరిగి, ఆవు నెయ్యితో 'వేపడం' చేసుకున్నాడు!

మధ్య మధ్య కాస్త చెయ్యి కాల్చుకున్నాడు గానీ మరీ అంత ప్రమాదం లేదు. ఆవకాయలో అన్నం నంజుకుని (కాస్త చిముడు, చిమిడుగా వుంది అన్నం మరి) కూర ముక్కలకు ఉప్పు అద్దుకుని- మొదట వేయడం మర్చిపోయాడు- (క్రొత్త గదా మరి) తిని- వెంటనే పరుగెత్తి, ఆఫీసుకు వెళ్లిపోయాడు.

కాని, అరగంట ఆలస్యమైంది అని 'మెమో' యిచ్చాడు వాళ్ల మానేజర్ ఛీ... ఛీ! సుబ్బారావు ఎంత పాకశాస్త్ర వీరుడో బొత్తిగా యెరుగని మానేజర్!

★ ★ ★ ★

నళిని- సుబ్బారావు వంట వుద్యమం అంతా గంగాయమ్మ ద్వారా విన్నది. కుతూహలం, సంతోషం, జాలి లాంటి వన్నీ ఆ పిల్ల మనసుని పెనవేశాయి. అద్దంలో చూసుకుంటూ కూడా- రెండు జెడలకు బదులు- పరధ్యానంలో- ఒక్క జెడ వేసుకుని, తిన్నగా, బామ్మ కంట బడకుండా, డాబా మీదకు వెళ్లి- సుబ్బారావు గది కిటికీలో నుంచి చూసింది. 'నిజంగా వండుకున్నాడు- ఫైగా

చాలా నీటుగా వండుకున్నాడు కూడా'నని మనసారా మెచ్చుకుంది డిగ్రీ పుచ్చుకుని కూడా వంట చేయగలగడం ఎంతో బాగుందీ అని ఆశ పడ్డది ఛీ. చీ! నాకు బామ్మ అంటున్నట్లు- రెండు జెడలు వేసుకోడం తప్ప- వంట కూడా రాదూ," అని బాధ పడింది పోనీ! సుబ్బరంగా, సుబ్బారావు లాంటి భర్త వస్తే, హాయిగా, తీరిగ్గా- రెండు జెడలే వేసుకుంటూ వుండొచ్చునని కూడా ధైర్య పడింది నేరుగా క్రిందికి దిగి వెళ్ళి బామ్మతో, 'బామ్మా! నువ్వు స్వార్థపరురాలివి, అంది గట్టిగా.

"ఏం జరిగిందే లక్ష్మిందేవీ? అన్నది వాళ్ళ బామ్మ, మడిగా, దూరంగా నుంచొని

"మడీ మడీ అంటూ ఆఖరికి నాకు వంట కూడా నేర్పలేదు' అన్నది నళిని కోపంగా

"ఆదా! నీ బెంగ? వంట దేం భాగ్యమే పిల్లా! రెండు జెడలు వెసుకోడం నేను నేర్పేను గనుకనా వంట నేర్పడానికి? అది మీ అత్తవారింట నేర్చుకుందువు గాని లే" నని ధైర్యం చెప్పింది బామ్మ

ఉహూఁ! నేను నేర్చుకోను" అంది నళిని

"సరే! మీ నాన్న ఓ వంట వాణ్ని చూసి తెస్తాడులే నవ్వింది బామ్మ

బోలెడు నవ్వి- పారిపోయింది నళిని

ఆ పారిపోవడంతో బోలెడు దూరదృష్టితో పారిపోయింది ఆ వంట వాడూ, ఆ నలుడూ- ఆ సుబ్బారావే అయితే- ఎంత బాగుణ్ను! హాయిగా దమయంతిలా 'కానీ సుబ్బారావు పెళ్ళయాక వంట మానేస్తాడేమోనని బయం వేసింది

నళిని- వెంటనే వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి, అమ్మా! అంది అత్యవసరంగా వాళ్ళమ్మ వెంటనే "పాపం! మన యింట అద్దెకు దిగిన అబ్బాయి చెయ్యి కాల్చుకుంటున్నాడటగా" అన్నది

ఔను! నన్నే అగ్గిపెట్టె అడిగాడు , అంది నళిని

"ఓసి నీ యిల్లు బంగారంగానూ అన్నది వాళ్ళమ్మ అని, మళ్ళీ కూతురు తల నిమిరి, 'మన వాళ్ళ అబ్బాయేనట పాపం! బుద్ధిమంతుడు కాకపోతే- యీ రోజుల్లో కూడా స్వయం పాకం చేసుకుంటాడా?" అన్నది

"పాపం! వంట చేసేవాళ్ళు లేరు కాబోలే అంది నళిని

మీ నాన్న గారితో చెప్పనా? వాళ్ళమ్మ మాటలకు ఆశ్చర్యపోయి, పారిపోయింది

నేరుగా బామ్మ దగ్గరికి వెళ్ళి, బామ్మా! నేను వంట నేర్చుకోను', అని గట్టిగా 'అరిచి, గదిలోకి పారిపోయి, మంచం మీదకు గెంతి, 'కల నిజమాయెగా అంటూ కాళ్ళెగరేస్తూ పాడుకుంది అలాగే నిద్రపోయి, కలలో సుబ్బారావు వంట అతను తినిపించగా, రుచి కూడా చూసింది!

★ ★ ★ ★

కాని ఏం చేస్తాం! కథల్లో విలన్లు ప్రవేశిస్తారుగా! కథ వంటతో ప్రారంభించి, పెళ్ళితో ముగిస్తే- రుచిగా బాగుణ్ను గానీ, సుబ్బారావు లాంటి వంట వండుకుని తినేటంత చాదస్తం వున్న వాడికి- ఆఖరికి హోటల్‌లో నైనా తినడం రాని వాడికి- 'పిల్లను యివ్వను , అన్నాడు నళినీ వాళ్ళ నాన్నగారు నళిని- యీ విలన్ లాంటి నాన్నలున్నంత కాలం- ఆడపిల్లలు వంటలు- ఆఖరికి వారపత్రికలు చదివైనా సరే నేర్చుకోవల్సిందే నని పశ్చాత్తాప పడింది విధిని తిట్టుకుంది

నలుడు వరించి వచ్చినా- మి నాన్నగారు వరం యివ్వనన్నారు , అంది వాళ్ళమ్మ బాదగా'

ప్చ్! ఏం చేస్తాం? నళినీ వాళ్ళ నాన్నగారలాంటి వాడు! కాని నళినికి మాత్రం సుబ్బారావు మీద ఆశ పోలేదు- వంట - పైగా- బామ్మ మడి కట్టుకుని చేసే వంట అంటేనే ఆ పిల్లకి యిప్పుడు మరీ అయిష్టమైపోయింది తన ప్రేమ గాథ విషాద గాథ కాకుండా రక్షించే దేముడెవడాని చూస్తోంది

వీరాజీ


చదవండి!
చదివించండి!!
★ విద్యారంగపు ప్రగతిని ప్రతిబింబిస్తూ
★ విద్యార్థుల విజ్ఞాన వికాసాలకు
★ ఉత్తమ సాహిత్య పరిచయానికి
★ 36 సంవత్సరాలుగా అవిరళ కృషి చేస్తూ
★ ఆబాల గోపాలాన్ని ఆకట్టుకున్న

తెలుగు విద్యార్థి

కొత్త గెటప్ లో-
మల్టీకలర్ ముఖచిత్రంతో
మరింత ఆకర్షణీయంగా
వెలువడుతోంది.
ప్రాతినిధ్యం లేనిచోట ఏజెంట్లు కావలెను
విడి ప్రతి రు. 2-50
సం॥ చందా రు. 30.00
వివరాలకు: తెలుగు విద్యార్థి
పోస్టుబాక్స్ నెం 1
మచిలీపట్నం-521001